క్లుప్తంగా

ఉద్యాన పంటలకు రాయితీలు

తుని రూరల్: వివిధ రకాల ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్.సుజాత తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. పండ్ల తోటల విస్తరణ పథకంలో ఆయిల్ పామ్, మామిడి, జీడిమామిడి, జామ, చింత, సపోట, అరటి, బొప్పాయి, కోకో, డ్రాగన్ ఫ్రూట్, పూల తోటలు, కూరగాయల పంటలకు రాయితీలు ఇస్తున్నట్టు చెప్పారు. ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల రైతులు సచివాలయాల్లో వీహెచ్ఏలు, వీఏఏలను సంప్రదించాలని సూచించారు.

90 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ఇందుప్రియ

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సురక్ష ఫిజియోథెరపీ ఆసుపత్రిలో వైద్యురాలు అలమండ తనూజనాయుడు ఆధ్వర్యంలో రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు వైద్యులు సకేత్, ఇందుప్రియ, ముత్యాలు రోగులకు పరీక్షలు చేశారు. సుమారు 90 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనూజనాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కంటిచూపు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం శస్త్రచికిత్స నిమిత్తం పదిమందిని రాజానగరం తరలించారు. కార్యక్రమంలో అలమండ వీరరాఘవస్వామి, అలమండ దుర్గా వెంకటప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు ప్రణాళిక

జగ్గంపేట: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటితో పాటు వాడకం నీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ తెలిపారు. జగ్గంపేట శివారు సీతానగరం గ్రామంలో తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. నగరం గ్రామంలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు, మురికి కాలువల సమస్య లేవనెత్తారని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్/శంఖవరం: మండలంలోని బవురువాకలో బాధిత కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. గ్రామానికి చెందిన జలుమూరు నాగేశ్వరరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ అమరాది కాశీ, బేత అర్జున్, జలుమూరు సింహాద్రి, నందా అచ్చయ్య, చిరునామాల చిన్ని, జలుమూరు శ్రీనివాసు, జీడ్డం గణేష్, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. శంఖవరం మండలంలోని శృంగధార గ్రామానికి చెందిన మరుగడి అప్పారావు కుమారుడు శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్‌లు దొడ్డి సత్యనారాయణ, గుండు చెంచుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తుంపాటి దేవుడురాజు, జలుమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువ రెగ్యులేటర్ పరిశీలన



ముక్కొల్లులో ఏలేరు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

కిర్లంపూడి: ముక్కొల్లులో శిథిలావ్యవస్థకు చేరిన ఏలేరు కాలువ రెగ్యులేటర్, రిటర్నింగ్ వాల్‌ను బుధవారం టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో పంట సాగుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిధులు తీసుకొచ్చి తాత్కాలిక మరమ్మతులు చేస్తామన్నారు. ఆయన వెంట ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు, ఈఈ శేషగిరిరావు, డీఈ ఎ.రవికుమార్, ఏఈ శ్రీనివాసరావు, రైతులు ఉన్నారు.

వర్షాకాలం.. వ్యాధుల గాలం

- మేకలు, గొర్రెలకు కాలిపుండ్లు
- ముందుగా గుర్తించకుంటే మందలో మిగిలిన జీవాలకు వ్యాప్తి
- జాగ్రత్తలతోనే నివారణ సాధ్యం



పొలంలో మేత మేస్తున్న గొర్రెలు, మేకలు

ప్రత్తిపాడు: వర్షాకాలం ప్రారంభమైంది. ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదముందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ తెలిపారు. ఈ వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నియోజకవర్గంలో 70 వేల మేకలు, గొర్రెలు

నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 70 వేలకు పైబడి మేకలు, గొర్రెలు ఉన్నాయి. మేతకు వెళ్లే మేకలు, గొర్రెల మందలు వర్షాల్లో తడవడం, మురికి కుంటలు, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండడం వల్ల సూక్ష్మజీవులు వాటి కాళ్లను ఆశించడంతో వ్యాధి బారిన పడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీనిని గుర్తించకుంటే ఒక మేకకు గానీ, గొర్రెకు గానీ వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత కాపరులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తమ సిబ్బంది, పశు వైద్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించాలని ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ సూచించారు.

వ్యాధి లక్షణాలు ఇలా....

ఈ వ్యాధి సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుక పడతాయి. సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్టు ఉంటే కాలిపుండు వచ్చినట్టు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన దుర్వాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదముంది.

చికిత్స ఇలా...

ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణం లేక 10 శాతం మైలతుత్తము ద్రావణం లేదా 5 శాతం ఫార్మలీన్ ద్రావణంలో నడిపించి, వాటి కాళ్లను శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులను దాదాపు 30 రోజుల వరకు పూతపూయాలి. అంతేకాకుండా అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉండాలి. మందను కాసే ప్రదేశాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వేయాలి.

– చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, ప్రత్తిపాడు

బూటకపు హామీలను ఎండగట్టాలి



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన బూటకపు హామీలను ప్రజల్లో ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సూచించారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు(పీఏసీ) ముద్రగడ పద్మనాభం నివాసంలో ముద్రగడ గిరిబాబును నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని కలిసిన వారిలో ఏలేశ్వరం టౌన్ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, బీశెట్టి అప్పలరాజు, జువ్విన వీర్రాజు, గుడాల వెంకటరత్నం, సరెడ్డి తిరుమలరాయలు, పులి మధు, దినేష్, రామిశెట్టి దొరబాబు, గురువీరా, పప్పల సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, వైద్య సిబ్బంది

తుని రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలకు డెంగీ, మలేరియా, అతిసార, కలరా వంటి వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.సాయినవీన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తేటగుంట, ఎన్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం సీజనల్ వ్యాధుల అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాతీయ డెంగీ వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలను చైతన్యపర్చాలన్నారు. డెంగీ, మలేరియా నివారణ చర్యలు వివరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల లక్షణాలను గుర్తించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు సోకినప్పుడు ఆస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ మరిడియ్య, పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్‌సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

శంఖవరం: వాతావరణంలో మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పర్వత రాజుబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. డ్రైన్లలో పూడిక తీయించాలన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకటరమణ, ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందిస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు

గోకవరం: స్థానిక జిల్లా పరిషత్ స్థలంలో 70 సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న సుమారు 120 మందికి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతికి గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో బుధవారం ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జిల్లా పరిషత్ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్ లేకపోవడంతో పంచాయతీ పన్నులు వేయడం లేదన్నారు. దీంతో కనీసం ఇంటి లోన్ పొందడానికి కూడా అర్హత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై సుమారు 24 సంవత్సరాల క్రితం తాను జెడ్పీటీసీగా ఉన్న సమయం నుంచి పోరాటం చేస్తున్నానని, ఇప్పటికైనా వారికి పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జెడ్పీ సీఈఓకు ఎన్‌ఓసీ ఇవ్వాలని ఆదేశించినట్టు ఎంపీపీ తెలిపారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



జోకా అమృతను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కిర్లంపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అపూర్వ గౌరవం దక్కుతుందని పలువురు రైతులు అన్నారు. మండలంలోని ఐదేళ్ల పాటు వ్యవసాయ శాఖ అధికారిగా విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు వెళ్లిన ఏఓ జోకా అమృతను బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులు, సిబ్బంది సాలువా, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా ఆమె నిరంతరం కృషి చేశారని కొనియాడారు. అలాగే నూతనంగా మండల ఏఓగా విధులు స్వీకరించిన సుధామాధురికి స్వాగతం పలికారు. అనంతరం బదిలీలపై ఇతర మండలాలకు వెళుతున్న వీఏఏ, వీహెచ్ఏలను సత్కరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఆకుల సురేష్, గుడాల రాంబాబు, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేశ్, సరిసే సంతోష్, ఏఎస్ఓ వెంకటేశ్ తదితరులు న్నారు.

మండల సమావేశం వాయిదా



సమావేశం వాయిదా పడడంతో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ రాము



కోరం లేకపోవడంతో వెలవెలబోతున్న కుర్చీలు

- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల గైర్హాజరు
- కోరం లేకపోవడంతో వాయిదా పడిన సమావేశం

తుని రూరల్: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ ప్రకటించారు. బుధవారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి 21 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో కుర్చీలన్నీ వెలవెలబోయాయి. ఎంపీపీ, టీడీపీకి చెందిన రేఖవానిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు, వివిధశాఖల అధికారులు హాజరయ్యారు. 24 మంది సభ్యులు గల మండల పరిషత్ పాలకవర్గంలో 21 మంది హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది తేదీ ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు. వివిధ శాఖల అధికారులు అప్పటికే హాజరవ్వడంతో వైద్య, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల పనితీరుపై సమీక్షించారు. వర్షాకాలంలో తాగునీటి క్లోరినేషన్, మంచినీటి సరఫరా, అంటువ్యాధులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అత్యవసర పనులను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ మరిడియ్య పాల్గొన్నారు.

మలుపు...ప్రమాదానికి పిలుపు



మల్లేపల్లి-ఉప్పలపాడు మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి నుంచి ఉప్పలపాడుకు వెళ్లే మార్గంలో బ్రిడ్జ్ శివారులో గల మలుపు ప్రమాదకరంగా ఉంది. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవించి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. హైవే విస్తరణలో భాగంగా బ్రిడ్జ్ నిర్మించిన నాటి నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పటించుకోలేదని ఉప్పలపాడు గ్రామస్తులు వాపోతున్నారు. ఇటీవల రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నప్పుడు మలుపును సరిచేయాలని సంబంధిత అధికారులకు చెప్పినా తమ సమస్యను పట్టించుకోకుండానే రోడ్డును వేశారన్నారు. ఈ మలుపు ప్రమాదకరంగా ఉండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాల జాడ తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వే నంబర్ 305లో సుమారు 73 లింకులు వెడల్పు ఉందని, ఈ సర్వే నెంబర్ గల భూమిని సర్వే చేయించి సరిహద్దులు నిర్ధారించి రోడ్డు మలుపును సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పీజీఆర్‌ఎస్‌కు ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



లింగంపర్తిలో శాకంబరి అలంకరణలో నూకాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న మహిళలు

ఏలేశ్వరం: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని లింగంపర్తిలో గ్రామ దేవతలకు బుధవారం సారె సమర్పించారు. లలిత సత్సంగం, మాతృమూర్తుల ఆధ్వర్యంలో గ్రామ దేవతలు నూకాలమ్మ, వసంతమ్మ అమ్మవార్లకు సారె సమర్పించారు. ఆషాడమాసం సందర్భంగా గోరింటాకు మహోత్సవం నిర్వహించి తాంబూలాలు అందజేశారు. పండితులు అమ్మవార్లకు శాకంబరి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆషాడ మాసంలో గ్రామదేవతలను ఆడపడుచులుగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లూరి గొల్లాజీరావు, పాటోలు దేవి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మ ధ్వంసం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నేతలు

పిఠాపురం: పట్టణ పరిధిలో 8వ వార్డు డ్రైవర్స్ కాలనీలో వైఎస్సార్ సీపీకి చెందిన జెండా దిమ్మ, శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు రావుల మాధవరావు, ఉలవల భూషణం, బోనాసుల శివ, పెదపాటి రాజేష్, చింతాడ నీలవేణి, పితాని కాశీ, కౌన్సిలర్లు తలిశెట్టి వెంకటేశ్వరరావు, బొజ్జా రామయ్య, కొత్తెం దత్తుడు, బోను దేవ, పచ్చిమళ్ల అప్పలరాజు, లలిత, ముమ్మిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

గండేపల్లి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తానని డిప్యూటీ ఎంపీడీఓ ఐఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన గండేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 18 పంచాయతీల్లోనూ మురుగు నీరు పారుదల, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటు, రక్షిత మంచినీటి సరఫరా, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో అంటురోగాలు సోకకుండా లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



యల్లమిల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి తోట

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లిలో మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందని బొడ్డు వెంకట్రావు ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబాన్ని తోట నరసింహం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామకుర్తి మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం జాయింట్ సెక్రటరీ ఒబిన్ని వీరబాబు, జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో గురువారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకూ చట్టబద్ధమైన గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. 3న శరభవరం, 4న చిన శంకర్లపూడి, పెద శంకర్లపూడి, బవురువాక, రాచపల్లి, ఒమ్మంగి గజ్జనపూడి, వెంకటనగరం, చింతలూరు, 5న లంపకలోవ, ఉద్దండ జగన్నాథపురం, పాండవులపాలెం, గోకవరం, బురదకోట, ఏలూరు, టి.రాయవరం, ఉత్తరకంచి, రౌతుపాలెం, పోతులూరు, వాకపల్లి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



గజ్జనపూడిలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ స్కూళ్లలో విద్యార్థులకు బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. విద్యార్థులకు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు సూచించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్లు గింజాల అప్పారావు, బర్ల అప్పలరాజు, గ్రామ పెద్దలు దాకారపు కృష్ణ, పల్లా గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెం, రామయ్యపాలెం, గండేపల్లి గ్రామాల్లో బుధవారం ఎంపీడీఓ కె.చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఐఎన్ శ్రీనివాస్ పర్యటించారు. డ్రైన్ల క్లీనింగ్, క్లోరినేషన్, తడి, పొడి చెత్త సేకరణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

1,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరులో సారా స్థావరాలపై బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చింతలూరు గ్రామానికి చెందిన ధారా వెంకన్నపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని మల్లిసాల, కాట్రావులపల్లి ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ డీఈ వీరభద్రరావు బుధవారం తెలిపారు. స్థానిక గోకవరం రోడ్డు, టీచర్స్ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్, నీలాజలంపేట, జ్యోతుల నెహ్రూ కాలనీ, సంజీవ్ కాలనీ, శ్రీరామ్ నగర్, బ్రహ్మల కాలనీ, కాట్రావులపల్లి, ఆక్వా సర్వీస్‌లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.